# పండుగలను సంతోషంగా జరుపుకోవాలి

- ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- దుర్గామాతకు పూజలు



బీబీనగర్‌లో అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న జడ్పీటీసీ ప్రణీత

బీబీనగర్ అక్టోబర్ 17 : దసరా, బతుకమ్మ పండుగలను ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతను ఎమ్మెల్యే మంగళవారం దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వెంకిర్యాల గ్రామంలో లక్ష్మీనారాయణ స్వామి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచులు మల్లగారి భాగ్యలక్ష్మి, అరిగె సుదర్శన్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, గోలి పింగళ్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న శరన్నవరాత్రోత్సవాలు

భువనగిరి అర్బన్, అక్టోబర్ 17 : దేవీ శరన్నవరాత్రోత్సవాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భువనగిరి పట్టణంలోని హనుమాన్‌వాడ, సాయిబాబా దేవాలయం ఆవరణలో, బహ్మం గారిగుడి సమీపంలో, హైదరాబాద్ చౌరస్తా, మీనానగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లో అన్నపూర్ణాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద మంగళవారం భక్తులు పూజలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్నాయికోడె నగేశ్, ఎంపీటీసీ యాస కవిత, ఉప సర్పంచ్ దొంతరబోయిన నవ్య, ఆలయ కమిటీ చైర్మన్ పొన్నగాని జహంగీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దెలమ్మదేవి ఆలయంలో లక్ష పుష్పార్చన

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మద్దెలమ్మ దేవి ఆలయంలో మంగళవారం సామూహిక లక్ష పుష్పార్చన, మహా అన్నదానం, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, దేవాలయ చైర్మన్ రుద్ర చెన్నకేశవులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## బొమ్మలరామారంలో అన్నదానం

బొమ్మలరామారం : మండల కేంద్రంలోని శివ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో అమ్మవారు అన్నపూర్ణ అవతారంలో దర్శనమివ్వగా భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.



భూదాన్ పోచంపల్లిలో మద్దెలమ్మ దేవి ఆలయంలో లక్ష పుష్పార్చనలో పాల్గొన్న భక్తులు



బొమ్మలరామారం : అన్నపూర్ణ దేవి పూజల్లో పాల్గొన్న యూత్ సభ్యులు

# నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలి

- పోలింగ్ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలి
- పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- కలెక్టర్ హనుమంతు కొండిబా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కొండిబా

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 17 : ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జెండగే హనుమంతు కొండిబా సెక్టార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సెక్టార్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సెక్టార్ అధికారుల విధివిధానాల హ్యాండ్ బుక్స్‌లోని నియమాలు, మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వల్నరబుల్ మ్యాపింగ్ చేయాలని, ఓటర్లను ప్రభావితం చేసే అవకాశాలున్న చోట తరచూ సందర్శించాలని ఆదేశించారు. బెదిరింపులకు పాల్పడిన వారిపై నిఘా పెట్టాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బూత్ లెవల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి ఓటర్లకు అవగాహన కలిగించాలని అన్నారు. ఓటింగ్ సజావుగా జరుగాలంటే పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు తప్పనిసరిగా కల్పించాలని, బూత్ లెవల్ అధికారుల సమన్వయంతో ర్యాంప్, మంచినీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు విద్యుత్ సౌకర్యం ఉండేలా చూడాలని, పూర్తి వసతులు ఉన్నాయని ధ్రువీకరణ నివేదిక సమర్పించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని, ఓటరు టర్న్ అవుట్ మీద శ్రద్ధ పెట్టాలని, ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్ పంపిణీ వంద శాతం అమలయ్యేలా చూడాలని సూచించారు. పోలింగ్ రోజు చేయవలసిన పనులు, ఓటు వేసేందుకు వచ్చేటప్పుడు తేవలసిన 12 రకాల గుర్తింపు కార్డులపై ప్రచారం చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్ లోపల, బయట చేపట్టవలసిన నిబంధనలు, ఓటింగ్‌కు 90 నిమిషాల ముందు మాక్ పోలింగ్ చేసే విధానం, పోలింగ్ ఏజెంట్లు ఉండేలా చూడడం, తదితర అంశాల పట్ల అవగాహనతో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు వంద శాతం ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను ఉల్లంఘించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జి.వీరారెడ్డి, ఎ.భాస్కర్‌రావు, భువనగిరి ఆర్డీఓ అమరేందర్, కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్, జిల్లా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

# కెమికల్ లైఫ్ కంపెనీ కార్మికుల ఆందోళన



కెమికల్ లైఫ్ కంపెనీలో ఆందోళన చేస్తున్న కార్మికులు

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 : మండలంలోని దోతిగూడెం గ్రామ పరిధిలోని కెమికల్ లైఫ్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. 60 మంది కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తున్నదని విమర్శించారు. కార్మికులకు వేతనాలు వెంటనే అందజేయాలని, లేకుంటే కంపెనీ ఎదుట ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామ మాజీ సర్పంచ్ పగిళ్ల రాంరెడ్డి హెచ్చరించారు.



సత్తయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

## సత్తయ్య కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 17 : భువనగిరిలో సోమవారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో గుండెపోటుతో మృతి చెందిన మెట్టు సత్తయ్య కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలూరు గ్రామంలో మంగళవారం సత్తయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ కోట పుష్పలత, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్ యాదవ్, పోచంపల్లి పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ యాకరి రేణుక, ఎంపీటీసీ బొమ్మ శంకరమ్మ, ఉప సర్పంచ్ వట్టిపల్లి హంస, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు చిలువేరు బాలనరసింహ, బందారపు లక్ష్మణ్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు మాదవరెడ్డి పాల్గొన్నారు.

## కామక్రోధాలు నశిస్తేనే దేవతానుగ్రహం

- సిద్ధగురు రమణానంద మహర్షి



దేవతామూర్తులకు అభిషేకం చేస్తున్న సిద్ధగురు రమణానంద మహర్షి

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 17 : అహంకారం, కామక్రోధాలు నశిస్తేనే దేవతానుగ్రహం లభిస్తుందని సిద్ధగురు రమణానంద మహర్షి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని శివశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు అభిషేకం, అర్చనపాటు హోమం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహంకారం, కామం, క్రోధంతో మనిషి జీవితం ఎంతో నష్టపోతుందని, ఆధ్యాత్మికత అలవర్చుకుంటే సుఖమయ జీవనం పొందవచ్చని అన్నారు.

## వలిగొండలో రూ.2.38లక్షలు పట్టివేత



వలిగొండలో ఓ వ్యక్తి నుంచి నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

వలిగొండ, అక్టోబర్ 17 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఒక వ్యక్తి వద్ద 2,38,500 రూపాయలు దొరికాయి. మండల కేంద్రంలోని తొర్రూరు చౌరస్తా వద్ద మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా.. మండలంలోని ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా పరిశీలించారు. అతని వద్ద లభ్యమైన 2,38,500 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును భువనగిరి డీటీఓ వద్ద జమ చేయనున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

## యానిమల్ హెల్త్ కేర్ సెంటర్‌కు వీధి కుక్కలు



వీధి కుక్కలను యానిమల్ హెల్త్‌కేర్ సెంటర్‌కు తరలిస్తున్న సిబ్బంది

భువనగిరి సిటీ, అక్టోబర్ 17 : పట్టణంలోని 23వ వార్డులో మున్సిపల్ సిబ్బంది మంగళవారం వీధి కుక్కలను పట్టి యానిమల్ హెల్త్ కేర్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ పడిగెల రేణుక మాట్లాడుతూ కుక్కలు, కోతుల వల్ల వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కుక్కలు పిల్లలు, వృద్ధులను గాయపరుస్తున్నాయని, కోతులు ఇంట్లోకి చొరబడి వస్తువులు, వంట సామగ్రి చిన్నాభిన్నం చేస్తున్నాయని చెప్పారు. దాంతో కుక్కలను పట్టి యానిమల్ హెల్త్ కేర్ సెంటర్‌కు తరలిస్తున్నామని, వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించి నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెడుతామని తెలిపారు.